

నిత్యాన్నప్రసాద వితరణ పథకానికి రూ.1,00,116 విరాళం

చేర్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మల్లన్న దేవాలయం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద వితరణ పథకానికి హైద రాబాద్‌కు చెందిన భక్తుడు కల్లం మహేందర్‌రెడ్డి సోమవారం అలయ ఏఈవో శ్రీనివాస్‌కు రూ.1,00,116 నగదు విరాళంగా అం దించారు. ఆయన వారికి రసీదు, ప్రసాదం పంపిణీచేశారు. కార్య క్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మల్లికార్జున్ ఉన్నారు.

అపార్ అవస్థలు

- ఈనెల 31తో ముగియనున్న గడువు
- మార్పుల కోసం ఆధార్ సెంటర్ల వద్ద క్యూలు
- విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పని ఇక్కట్లు



అపార్ నమోదు ప్రక్రియ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తోంది. స్టూడెంట్‌కు సంబంధించిన స్కూల్ అడ్మిషన్ రిజిస్టర్, ఆధార్, యూడైస్‌లో పొందుపరిచే సమాచారం ఒకే విధంగా ఉండాలనే నిబంధన విద్యార్థుల తల్లిదండ్రులకు తలనొప్పి తెచ్చిపెడుతోంది. విద్యార్థి ఆధార్‌లో పేరు, పుట్టిన తేదీ, ఆధార్ సంఖ్య ఏ విధంగా ఉంటే యూడైస్‌లో నమోదు చేసిన వివరాలు కూడా అలాగే ఉండాలి. అప్పుడే ఆధార్ జనరేట్ అవుతుంది. యూడైస్ పోర్టల్లో ఒక్క అక్షరం తేడా వచ్చిన కూడా అపార్ జనరేట్ కావడం లేదు. దీంతో స్కూలు నుంచి బోనాఫైడ్‌లు తీసుకుని సరిచేసుకోవడానికి ఆధార్ సెంటర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. అయితే, ఈ ప్రక్రియ నమోదుకు ఈనెల 31 చివరి తేదీ కావడంతో నమోదు కోసం వారు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వారిని మరో సమస్య వేధిస్తోంది. ఆధార్‌లో తప్పును సవరించేందుకు ఒకసారి, మరోతప్పును సవరించేందుకు మరోసారి దరఖాస్తు చేయాలి. పుట్టిన తేదీ, స్పెల్లింగ్ మిస్టేక్ ఉంటే రెండు సార్లు దరఖాస్తు చేసుకోవాలి. సవరణకు మరో రోజు రావాలని ఆధార్ సెంటర్ వాళ్లు చెబుతున్నారు.

- సిద్దిపేట కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి)

'అపార్' అంటే..?

అపార్ అంటే "ఆటోమెటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ". ఇది విద్యార్థికి జీవితకాలపు ఐడీ నంబర్. జాతీయ విద్యావిధానంలో భాగంగా విద్యార్థులందరికీ అపార్‌ఐడీలు ఇవ్వాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అన్ని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు చదువుతున్న విద్యార్థుల వివరాలతో డిజిటల్ ఐడీ కార్డు రూపొందిస్తారు. వీటి వల్ల విద్యార్థుల అకాడమిక్ క్రెడిట్లు, డిగ్రీలు ఇతర సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తమవుతాయి. విద్యార్థుల విద్యాప్రమాణాలు, విజయాలను నమోదు చేయడంతో పాటు ట్రాక్ చేస్తుంది. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ సులభతరం చేస్తుంది. ఈ ప్రక్రియ ఇప్పటికే అన్ని విద్యా సంస్థలో కొనసాగుతోంది.

జిల్లాలో నమోదు ఇలా..

జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు సుమారు 1300 వరకు ఉన్నాయి. ఇందులో దాదాపు లక్షా డెబ్బై వేల మంది విద్యార్థులున్నారు. వీరి వివరాల నమోదు ప్రక్రియ ఇప్పటికే ఆయా విద్యాసంస్థల్లో కొనసాగుతుంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 50 మాత్రమే నమోదు పూర్తయింది. కొద్దిరోజులే మిగిలి ఉండటంతో పూర్తిస్థాయిలో నమోదు జరుగుతుందా? అనేది ప్రశ్నార్థకమే. జిల్లావ్యాప్తంగా 27 ఆధార్ నమోదు కేంద్రాలుండగా, అందులో 16 మీసేవా కేంద్రాలు, 10 బ్యాంకుల్లో బయోమెట్రిక్ సెంటర్లు, ఒకటి పోస్టాఫీసులో ఉన్నాయి. సిద్దిపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆధార్ సెంటర్ల బాట పడుతున్నారు. ఇక ఈ క్రమంలోనే కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల దరఖాస్తు కోసం, రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు నమోదు చేయడానికి కొత్త ఆధార్ కార్డుల కోసం జనాలు వస్తున్నారు. మరోవైపు మహాలక్ష్మీ పథకం కోసం కూడా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. పాత ఫొటో ఉండడం వల్ల స్పష్టంగా కనిపించడం లేదని, ఆంధ్రప్రదేశ్ అని ఆధార్ మీద ఉండటంతో కండక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ అప్‌డేట్, అపార్ కోసం వచ్చేవాళ్లు, ప్రభుత్వ పథకాల కోసం కొత్తవాటి కోసం, ఉచిత బస్సు ప్రయాణానికి అప్‌డేట్ కోసం వచ్చేవారితో ఆధార్ సెంటర్లు రద్దీగా మారుతున్నాయి.



ఆధార్‌లో మార్పుల కోసం సెంటర్‌కు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు

స్కూళ్లలోనే సెంటర్ ఏర్పాటు చేయాలి



నాకు ముగ్గురు పిల్లలు. కొద్దిరోజులుగా ఆధార్ అప్‌డేట్స్ కోసం తిరుగుతున్నాం. పుట్టిన తేదీ సమస్య అయితే ఒకసారి అప్‌డేట్ చేస్తున్నారు. మరో తప్పు ఉన్నా.. స్పెల్లింగ్ తేడా ఉన్నా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు. వ్యవసాయ పనులన్నీ వదిలిపెట్టి ఆధార్ సెంటర్‌కు, స్కూలుకు తిరగాల్సి వస్తుంది. పిల్లలు చదివే విద్యాసంస్థలోనే ఆధార్ సెంటర్‌లను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుంది.

- జి. కిషన్, సూరంపల్లి, దౌల్తాబాద్ మండలం

స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తాం



అపార్ అనేది విద్యార్థులకు చాలా ముఖ్యమైనది, అవసరమైనది. తప్పనిసరిగా ప్రతి విద్యార్థి తప్పకుండా అపార్ ఐడీ కలిగి ఉండాలి. కొద్దిరోజులే మిగిలి ఉండటంతో జిల్లా కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో 15 మందితో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తున్నాం. మండలాల వారీగా ప్రత్యేకంగా రివ్యూలు ఏర్పాటు చేస్తున్నాం.

- యాలాల్ల నర్సింహులు, జిల్లా గణంకాధికారి



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రజావాణికి 117 దరఖాస్తులు

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్ జనవరి 27(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 117 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ఆయన వినతులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతల మేరకు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పియండి



పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా దురదృష్టవశాత్తు 18నెలల క్రితం కాలు పోయింది. కుటుంబానికి నేనే పెద్ద దిక్కు. కాలుపోయినప్పటి నుంచి కుటుంబపోషణ భారమైంది. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

- వెంకటేష్ రామవరం, కుకునూరుపల్లి మండలం

కాలువలతో భూమి ముక్కలవుతుంది



గతంలో మా భూముల్లో నుంచి ప్రధాన కాలువ, మరో కాలువ వెళ్లింది. ఇప్పుడు మూడోకాలువ కోసం అధికారులు మాకు చెప్పకుండానే సర్వే చేస్తున్నారు. మూడో కాలువ కూడా పోతే భూమి మూడు ముక్కలవుతుంది. కనీసం సాగు చేసుకోవడానికి వీలుండదు.

- రైతులు, బంజేరుపల్లి హుస్నాబాద్ మండలం

ప్రొటోకాల్ ఉల్లఘించారు

- బీఆర్ఎస్ నాయకులు

ప్రొటోకాల్ ఉల్లంఘనపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుల బృందం గుండు భూపేష్, జాప శ్రీకాంత్, మచ్చ వేణుగోపాల్ రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 26న ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా నంగునూర్ మండలం నాగరాజుపల్లిలో జరిగిన పథకాల ప్రారంభోత్సవంలో మండల ప్రత్యేక అధికారి డీపీవో, ఎమ్మార్వో ఎలాంటి రాజ్యాంగ పదవులు లేని కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజల హరికృష్ణ, ఇతర మండల నాయకలను వేదిక మీదకు పిలిచి సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను ఇప్పించడం ప్రోటో కాల్ ఉల్లంగన అని పేర్కొన్నారు. అధికారులు ఎలా వారిని పిలిచి ఇప్పిస్తారని ప్రశ్నించారు. కొంత మంది అధికారులు అధికార పార్టీ నాయకుల ప్రోత్సహించడంపై తీవ్రంగా ఖండించారు. గతంలో కూడా ఇలాంటివి జరిగాయని వారు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

మున్సిపాలిటీల ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్



బాధ్యతలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

గజ్వేల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సోమవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆదివారంతో జిల్లాలోని గజ్వేల్-ప్రజ్ఞాపూర్, చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం పూర్తికావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు బాధ్యతలను అప్పగించారు. అయితే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సెలవులో ఉన్నందున ప్రస్తుతం రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ హమీద్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నాలుగు మున్సిపాలిటీల కమిషనర్ల సమక్షంలో ఆయన బాధ్యతలను చేపట్టారు. ఆయా మున్సిపాలిటీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారితో ఆయా మునిసిపాలిటీల కమిషనర్లు గొల్కొండ నరసయ్య, రమేశ్ తదితరులున్నారు.



సింగరాయ జాతర చూసొద్దామా..

- గుట్టల మధ్య.. గృహల్లో లక్ష్మీనరసింహుడు
- శాఖాహార వంటలు.. కాలినడకన వెళ్తేనే దర్శనం
- రేపు జాతర.. ఏర్పాట్లు పూర్తి

7 లో



పిచ్చుకల అపార్ట్‌మెంట్..

సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి నాంచార్‌పల్లికి వెళ్లే దారిలోని రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ఊర పిచ్చుకల అపార్ట్‌మెంట్‌ను తలపిస్తోంది. బ్రిడ్జి నిర్మాణ సమయంలో అక్కడక్కడా చిన్న చిన్న రంధ్రాలు చేసి పైపులు వేశారు. కొన్ని పిచ్చుకలు ఆ పైపుల్లో నివాసం ఏర్పాటు చేసుకుని అందులో గుడ్లు పెడుతూ.. పొదుగుతున్నాయి. అప్పుడప్పుడు ఆహార అన్వేషణ కోసం బయటకు వెళ్లి వస్తూ సవ్వడి చేస్తున్నాయి..

- సిద్దిపేట జిల్లా ఫొటోగ్రాఫర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి)

సిగ్నల్ లేని లైట్లు..

- సిద్దిపేటలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్
- చౌరస్తాల వద్ద ఇష్టారీతిన వెళ్తున్న వాహనదారులు
- ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ నిత్యం జామ్
- నిత్యం ఏదో ఓ చోట ప్రమాదాలు





సిద్దిపేటలోని హౌసింగ్ బోర్డు చౌరస్తా వద్ద సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ఇష్టారీతిన వెళ్తున్న వాహనదారులు

సిద్దిపేట క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధితో పాటు జనాభా కూడా పెరిగిపోతుంది. ఉద్యోగం, వ్యాపారం, చదువులరీత్యా అనేక మంది జిల్లా కేంద్రానికి వస్తున్నారు. అలాగే వాహనాల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోంది. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మూడేళ్ల క్రితం సిద్దిపేటలోని అన్ని చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల పాటు బానే పనిచేశాయి. ఆ తర్వాత కేబుల్స్ తెగిపోవడం, అంతర్గతంగా ఉండే సాంకేతిక సమస్యలతో పాడయ్యాయి. ముఖ్యంగా సిద్దిపేటలోని అంబేడ్కర్ చౌరస్తా, విక్టరీ చౌరస్తా, ముస్తాబాద్ చౌరస్తా, హౌసింగ్ బోర్డు చౌరస్తా, బ్లాక్ ఆఫీస్ చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ క్రమక్రమంగా పూర్తిగా పనిచేయకుండా పోయాయి. ఆ తర్వాత ట్రాఫిక్ పోలీసులు మరమ్మతులు చేయించకపోవడంతో అన్ని చౌరస్తా వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిపోయింది. గతంలో సిగ్నల్ జంప్ చేస్తే ఫైన్ పడుతుంది అనే భయంతో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేవారు. ఇప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోడం, అక్కడక్కడా సీసీ కెమెరాలు కూడా పనిచేయకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలను నడుతున్నారు. రద్దీ చౌరస్తాలలో, సిగ్నల్స్ పనిచేయని చోట ఇద్దరు ముగ్గురు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. కానీ ఫలితం లేకుండా పోతుంది. కొన్నివాహనాలకు నంబర్ ప్లేట్లు సరిగా లేకపోవడంతో పోలీసులు కూడా చర్యలు చేపట్టలేకపోతున్నారు. సంబంధిత అధికారులు సిద్దిపేట పట్టణంలో ఉన్న అన్ని చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ రిపేరు చేయించాలని పలువురు కోరుతున్నారు.



సిద్దిపేటలోని గోల్డెన్ బేకరీ చౌరస్తా వద్ద ఇష్టారీతిన వెళ్తున్న వాహనదారులు

త్వరలోనే రిపేర్ చేయిస్తాం

- సుమన్ కుమార్, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ



సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆరు చౌరస్తాల్లో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ సాంకేతిక కారణాలతో పనిచేయడం లేదు. వాటికి సంబంధించిన కాంట్రాక్టర్‌కు మాట్లాడి చెప్పాం. త్వరలోనే అన్ని చౌరస్తాలలో సిగ్నల్స్ పనిచేసే విధంగా చేస్తాం. అప్పటివరకు రద్దీ ఉన్న చౌరస్తాల్లో ట్రాఫిక్ నియంత్రించేందుకు సిబ్బందిని పెంచుతాం. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు, సిగ్నల్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు తప్పవు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

- ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన
- నెలాఖరుకు ముగియనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలు

జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లాలోని పోలీసులు రవాణాశాఖ అధికారులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రతీసారి జనవరిలో ఈ రోడ్డు భద్రతా మాసోత్సవాలను రవాణా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈసారి కూడా జనవరి 1న ప్రారంభమైన రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఈనెలాఖరుతో ముగియనున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 302 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రద్దీ గల ప్రాంతాల్లో, చౌరస్తాల్లో ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో, బస్టాండ్ వద్ద, వాహనదారులను ఆపి ట్రాఫిక్ నియమాలను, రోడ్డు భద్రతా నియమాలపై వివరంగా తెలియజేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లోనూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలీసులు రోడ్డు నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేస్తున్నారు.

ఒకరి స్థానంలో మరొకరు విధుల్లో

- ఏకంగా ఇన్‌చార్జి వార్డు ఆఫీసర్‌గా హాజరు
- మెదక్ బల్దియాలో వింత పోకడ

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మున్సిపాలిటీలో ఒకరి స్థానంలో మరొకరు విధులు నిర్వహిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అనారోగ్యం సాకుతో కొందరు వారి కుటుంబసభ్యులను విధుల్లోకి పంపుతున్నారు. జీతం పొందేది ఒకరైతే పనుల్లో మాత్రం ఇతర వ్యక్తులను ఏర్పాటు చేసుకుంటున్నారు. మెదక్ మున్సిపాలిటీలో ఇలా సుమారు 15 మందికిపైగా ఉన్నారు. వారంతా వాటర్ సప్లై, శానిటేషన్ విభాగాల్లో పనిచేస్తుండగా అందులో ఒకరిని ఏకంగా వార్డు అధికారిగా నియమించారు.



Community Hall, Nawabpet	Ch. Naveen(Jr.Asst), 9949602438
New Primary School Dayara	S. Yeshamma(Jr.Asst), 9553374662
Near Primary School,Dayara	S. Nagesh(Jr.Asst), 9441761970
Community Hall Near Primary School, Gandhi Nagar	P.Prahalad(WO), 9959966872
CSI Community Hall, Church Compound	G. Savithri(WO), 9553474720
Community Hall Padmashali Snagam Kamela	Shameen Fathima (I/C) WO, 9849614275
Govt. School, Chinthabanda	B.Harikrishna(WO), 9390424331
Balaji Matam, FatheNagar	N.Sai Kiran(WO), 8328353927
Brahmam Gari Matam, FatheNagar	P.Srujana(WO), 7989228385
Shishu Mandhir School Brahmam ...	V.Rajashekar(WO), ...

వార్డు అధికారిగా షమిన్ ఫాతిమా పేరు

మెదక్ మున్సిపాలిటీలో షమీన్ ఫాతిమా అనే మహిళ అటెండర్‌గా ఉండగా, ఆమె కుమారుడు విధులు నిర్వహిస్తున్నాడు. ఆయననే ఓ వార్డుకు అధికారిగా కూడా నియమించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వార్డుసభలలో సైతం అతడే విధులు నిర్వహించాడు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల్లో సైతం సంతకాలు చేసి తీసుకోవడం గమనార్హం. ఇతర మున్సిపాలిటీల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని మాత్రమే వార్డు అధికారిగా విధులు కేటాయిస్తుండగా, ఇక్కడ మాత్రం ఏకంగా బదిలీ వర్కర్‌కు వార్డు కేటాయింపు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా మెదక్ మున్సిపల్ పరిధిలో నిబంధనలను తుంగలో తొక్కి ఒకరికి బదులు మరొకరు విధులు నిర్వహిస్తుండడం అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే అయినా చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపల్ పాలకవర్గం గడువు ముగియడంతో సోమవారం నుంచి ప్రత్యేక అధికారి పాలన కొనసాగుతుంది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అయినా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సిబ్బంది తీరుపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. జీతం ఒక చోట మరోచోట పనులు చేసేవారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించగా షమీన్ ఫాతిమా కుమారుడిని వార్డు అధికారిగా తొలగిస్తున్నట్లు చెప్పారు.

రాబోయే రోజుల్లో మిలిటెంట్ ఉద్యమాలు

- సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి
- రైతుకు మద్దతు ధర ఇవ్వాలి
- ఎస్. వీరయ్య

7

డివైడర్‌ను ఢీకొన్న బైక్

- ఇద్దరు యువకులు మృతి

7

తాతల నాటి చెట్టు!

- గ్రామంలో ఏ సభ జరిగినా అక్కడే..
- పంచాయతీ సమావేశాలకూ నీడ
- సినిమా షూటింగ్‌లకు వేదిక

7

పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను కలిసిన నాయకులు

శివ్వంపేట /చేగుంట, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. అలాగే చేగుంట మండల ఎమ్మార్పీఎస్ నాయకుడు కొల్పుల రామస్వామి తదితరులు మందకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి కోసం పాటుపడుతున్న మందకృష్ణ మాదిగకు అరుదైన గౌరవం దక్కడం సంతోషంగా ఉందన్నారు.

తాతల నాటి చెట్టు..!



గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న నందాల మర్రి చెట్టు

గ్రామంలో ఏ సభ జరిగినా అక్కడే..

- పంచాయతీ సమావేశాలకూ అడ్డా..
- సినిమా షూటింగ్‌లకు వేదిక

కోహీర్, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన'గాంధీ తాత చెట్టు'.. సినిమా చెట్టు.. గ్రామం ఇతివృత్తంగా ప్రశంసలు అందుకున్నట్లుగానే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పీచేర్యాలగడి గ్రామంలోని నందాల మర్రిచెట్టు చెట్టు చరిత్రగా మారుతోంది. ఎప్పుడు.. ఎవరు నాటారో తెలియదు కానీ, తాము చిన్నపిల్లలుగా ఉన్నప్పటి నుంచి ఆ చెట్టు నీడనే ఆడుకున్నామని ఇప్పటి వృద్ధులు చెబుతున్నారు. మా నాన్న చిన్నతనంలోనూ ఈ చెట్టు ఉందని చెప్పేవాడని గ్రామానికి చెందిన 70 ఏళ్ల తేనెల అంజయ్య చెబుతున్నారు. గ్రామంలో ఏ సభ జరిగినా.. చివరికి పంచాయతీ సమావేశాలూ ఆ చెట్టుకిందనే నిర్వహిస్తారు. మండలంలోని పీచేర్యాగడి గ్రామ పంచాయతీ ముందు ఏళ్ల నాటి మర్రిచెట్టు ఎత్తుగా ఎదిగి, గ్రామస్థులకు చల్లటి నీడను ఇస్తోంది. విశాలమైన కొమ్మలతో విస్తరించిన ఈ చెట్టు కొమ్మలు కొన్ని నరికి వేసినా.. విస్తరిస్తూ నీడను పంచుతోంది. గ్రామ పంచాయతీ ఎదుటే ఉండటంతో కార్యాలయంలో కంటే ఇక్కడ కూర్చునేందుకే సిబ్బంది ఎక్కువ ఇష్టపడుతుంటారు. ఇక పిల్లల ఆటలకు, పెద్దల కాలక్షేప కబుర్లకు ఈ చెట్టు ఓ వేదికగా మారింది. వేసవి కాలంలో అయితే, గ్రామంలోని పెద్దల నుంచి యువకులు, చిన్నపిల్లలు అందరూ ఈ చెట్టు కిందికే చేరుతారంటే అతిశయోక్తి కాదు. ఆ చెట్టు కింద ఎంత సేపు కూర్చున్నా వెళ్ల బుద్ధి కాదని చెబుతుంటారు. అందరూ నందాల మర్రి చెట్టు అని పిలుచుకున్నా.. దానికి ఆ పేరు ఎవరు పెట్టారో కూడా ఎవరూ చెప్పలేకపోతున్నారు.



పీచేర్యాగడి జీపీ ఎదుట ఉన్న మర్రిచెట్టు కింద కూర్చున్న గ్రామస్థులు

మేము పుట్టక ముందు నుంచే..



పీచేర్యాగడి గ్రామపంచాయతీ కార్యాలయం ముందున్న నందాల మర్రిచెట్టు వయసు 150 సంవత్సరాల పైనే ఉంటుంది. మేము పుట్టక ముందు నుంచే ఈ మర్రిచెట్టు గ్రామంలో ఉంది. నా వయసు ప్రస్తుతం 70 సంవత్సరాలు. మా నాన్న చిన్నగా ఉన్నపుడు నుంచే ఈ చెట్టు ఉందని చెప్పేవాడు. గ్రామంలోని ఎవరిని అడిగిన మేము పుట్టక ముందు నుంచే ఇక్కడ చెట్టు ఉందంటారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయము నిర్మించక ముందు ఈ చెట్టుకింద పంచాయతీలు, సమావేశాలు నిర్వహించేవారు. **- తేనెల అంజయ్య, పీచేర్యాగడి**

షూటింగ్‌లకూ..

గ్రామంలోని పెద్ద మర్రిచెట్టు వద్ద పలు సినిమా షూటింగ్‌లు జరిగాయి. ప్రముఖ నటి త్రిష నటించిన నాయకిని సినిమా షటింగ్‌లో కొంత భాగం ఇక్కడే చిత్రీకరించారు. పలు సినిమాల్లోనూ ఈ చెట్టు కనిపిస్తుంటుంది.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరు యువకులు మృతి




మైలారం స్వామి, మన్నే సదానందం (ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గజ్వేల్ పట్టణంలోని ముట్రాజ్‌పల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ముట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మైలారం స్వామి(25), సంగుపల్లి గ్రామానికి చెందిన మన్నే సదానందం(27) పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అవివాహితులైన వీరు ఒకే పని చేస్తుండటంతో స్నేహితులుగా మారారు. ఈ క్రమంలో ఒకే బైక్‌పై పనికి వెళ్లి వస్తున్నారు. ఆదివారం రాత్రి పని ముగించుకొని ప్రజ్ఞాపూర్ నుంచి ముట్రాజ్‌పల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో మహిళా భవనం వద్దకు రాగానే వీరి బైక్ వేగంగా వెళ్లి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

వ్యాన్ ఢీకొని.. టోల్‌ప్లాజా సెక్యూరిటీ గార్డు మృతి

కొండపాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం రాంపల్లి శివారులో సోమవారం ద్విచక్రవాహనంను వ్యాన్ ఢీకొట్టడంతో టోల్ ప్లాజా సెక్యూరిటీ గార్డ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాంపల్లి గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి (35) టోల్ ప్లాజాలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని గ్రామానికి మోటర్ సైకిల్ పై వెళ్తుండగా రాంపల్లి శివారులో వ్యాన్ ఢీ కొట్టింది. దాంతో తీవ్ర గాయాలైన ఆయన అక్కడికక్కడ మృతి చెందాడు.

కూడవెల్లికి నీటిని విడుదల చేయండి

రోడ్డెక్కిన రైతులు



అక్బర్‌పేట బ్రిడ్జి వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సిద్దిపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కూడవెల్లి వాగుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వాగు పరివాహక ప్రాంత రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. బ్రిడ్జి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వాగు పరిసర ప్రాంతాల్లో వరి నాట్లు వేసుకున్న రైతులు కూడవెల్లిలో నీరు లేక నారు ఎండిపోతుందన్నారు. వెంటనే వాగులోకి మల్లన్నసాగర్ ద్వారా కూడవెల్లి వాగులో నీటిని వదలాని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి.. రైతులను సముదాయించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారవు. కార్యక్రమంలో రైతులు భాను, రాంచందర్‌రావు, కృష్ణ, మహేందర్ తదితరులున్నారు.

సింగరాయ జాతర చూసొద్దామా..

- గుట్టల మధ్య.. గృహల్లో లక్ష్మీనరసింహుడు
- తూర్పు నుంచి పడమరకు ప్రవహించే సెలయేరు
- శాఖాహార వంటలు.. కాలినడకన వెళ్తేనే దర్శనం
- రేపు జాతర.. ఏర్పాట్లు పూర్తి



సింగరాయు గుట్టల్లో జాతర జరిగే ప్రదేశం



కోహెడ, జనవరి 27 : పచ్చని చెట్లు.. ఎత్తైన కొండలు.. జలజలా పారే సెలయేరు.. పక్షుల కిలకిలరావాలతో ఎటు చూసిన పచ్చదనంతోపాటు తూర్పు నుంచి పడమరకు ప్రవహించే మోయతుమ్మద వాగు.. దీనిపై నిర్మించిన సింగరాయ ప్రాజెక్టు.. ఇలా ఈ ప్రాంతం దేనికదే ప్రత్యేకం. ఇక్కడి సమీపంలోని గృహలో వెలసిన ప్రతాప సింగరాయ(శ్రీ లక్ష్మీ నరసింహస్వామి) జాతరకు వేళయింది. ఏటా పుష్య బహుళ అమావాస్య రోజున (ఈ నెల 29న) జరిగే సింగరాయ జాతరకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు.

కాలినడకన వెళ్తేనే..

కోహెడ మండలంలోని కూరెళ్ల, తంగెళ్లపల్లి, బస్వాపూర్, గుండారెడ్డిపల్లి గ్రామాల మధ్య కొండగుహల్లో వెలిసిన ప్రతాప రుద్ర సింగరాయ (లక్ష్మీనృసింహస్వామి)ని దర్శించుకోవడానికి కాలి బాటనే వెళ్లాల్సి ఉంటుంది. కాకతీయుల కాలంలో సింగరాయ అనే వాస్తుశిల్పి మోయతుమ్మెద వాగుపై ప్రాజెక్టు నిర్మించేందుకు వచ్చి అక్కడే ఉండిపోయడని, అతడి పేరుతోనే ప్రకృతి ఆలయం ఏర్పడిందని ప్రతీక. అప్పటి నుంచి అతడి పేరిట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జాతర జరుగుతుంది. ఇక్కడ తూర్పు నుంచి పడమరకు పారే సెలయేరు ఉండటంతో స్నానలు చేసిన భక్తులు తమ పాపాలు హరించుకుపోవడంతో పాటు చర్మవ్యాధులు నశిస్తాయని నమ్ముతారు. గుండం ఎగువన కొద్ది దూరంలో వాగు పక్కన సొరికె మాదిరిగా ఉన్న ప్రాంతాన్ని సన్యాసుల మఠంగా పిలుస్తారు. ఇందులో అంజనేయ స్వామి కొలువు దీరి ఉన్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిదర్శించుకునే దారిలోనే చతుర్ముఖ బ్రహ్మ విగ్రహం, ఆంజనేయ (కాల బైరవుడు) స్వామి విగ్రహాలు నెలకొల్పి ఉన్నాయి.

శాఖాహార వంటలు

అన్ని జాతరలకు భిన్నంగా సింగరాయ జాతర ఒకరోజు మాత్రమే జరుగుతుంది. మోయతుమ్మెద వాగులో స్నాలు చేసి, ఎత్తువంపులు గల కొండలు ఎక్కి గుహలో కొలువైన లక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకుని.. రాత్రి వరకు ఉంటే స్వామి వారికి తలనొప్పి వస్తుందంటూ మొక్కులు చెల్లించుకుని చీకటి పడకముందే బయలుదేరుతారు. ఈ జాతరలో శాఖాహార వంటలు ప్రత్యేకం. మాంసం, మద్యం, ధూమపానాలు చేయరు. టమాటా, వంకాయ, చిక్కుడు, చారుతో వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేస్తారు. కొండ చరియలు, చెట్ల నుంచి వివిధ వన మూలికలను తాకుతూ ప్రవహించే వాగునీటితో చేసిన వంటలు రుచిగా ఉండటమే గాక, సర్వ రోగాలకు దివ్య ఔషధంలా పనిచేస్తాయని భక్తులు నమ్ముతారు.

సస్యరక్షణకు డ్రోన్ల వినియోగం



మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్

సిద్దిపేట రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగంలో యంత్రీకరణ కీలకంగా మారిందని, రైతులు పంట సస్యరక్షణకు డ్రోన్‌లను వినియోగించడం పెరిగిందని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. శ్రీదేవి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం డ్రోన్‌ల వినియోగంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగులో సాంకేతికత ఉపయోగించి నూతన వంగడాలు సృష్టించవచ్చునని, డ్రోన్‌లతో పురుగు మందులు పిచికారీ చేయడంతో పాటు, వరినీ విత్తుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.రామ్ గోపాల వర్మ, డాక్టర్ జే. సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి టి.రాధిక, ఏడీఏ పద్మ, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో మిలిటెంట్ ఉద్యమాలు

- సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి
- రైతుకు మద్దతు ధర ఇవ్వాలి: ఎస్. వీరయ్య



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య

సంగారెడ్డి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై రాబోయే రోజుల్లో మిలిటెంట్ ఉద్యమాలకు సన్నద్ధమవుతున్నామని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా సోమవారం కొండాపూర్ మండలం మల్కాపూర్ చింతల్‌లో పార్టీ మరో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగే రాష్ట్ర మహాసభలో రాష్ట్రంలో వివిధ ప్రధాన అంశాలపై చర్చించి ఆయా అంశాలపై తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించినా పూర్తిస్థాయిలో పేదలకు ఇవ్వలేకపోయిందన్నారు. తమకు ఇళ్లిస్తారని నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లేసిన పేదలకు కూడా అన్యాయమే జరిగిందన్నారు. ఎన్నికల ముందు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు కేవలం ఐదు లక్షలు ఇస్తామంటున్నారని విమర్శించారు. ఇళ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు లేని పేదలకు వేలల్లో ఉన్నారని వారికి అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై పోరాటాలు చేసేందుకు మహాసభలో తీర్మానించినట్లు ఆమె తెలిపారు.

దేశానికి అన్నం పెట్టే రైతుల సంక్షేమం కోసం, వారికి మద్దతు ధర కల్పించే చట్టం చేసేందుకు బీజేపీ వెనుకడుగు వేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్. వీరయ్య ఆరోపించారు. పేదలను కాంగ్రెస్ ఆదుకుంటుందని అధికారం ఇస్తే మూసీ ప్రక్షాళణ పేరుతో పేదలను రోడ్డుకీడుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 1.30 కోట్ల మంది కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని, మోదీ కార్మికులకు రోజుకు రూ.178 కూలి ఇస్తే సరిపోతుందని చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచితే ప్రభుత్వంపై పైసా ఖర్చు పడదని అయినా పెట్టుబడిదారులు, కార్పొరేటర్లకు లాభాలు చేకూర్చేందుకు కార్మికుల పొట్ట కొడుతున్నారు. కనీస వేతనాల ముసాయిదాని విడుదల చేసి రూ.11వేలు ఇస్తే సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో ఒప్పంద అధ్యాపకుల నిరసన



ఇంజనీరింగ్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు

పుల్‌కల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తర్వాతే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు సోమవారం కళాశాల పరిపాలనా భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి రిటర్మెంట్ వయస్సును 65కు పెంచుతామని, త్వరలో నోటిఫికేషన్‌కు వెళ్తామని అన్నారని, ఆ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామన్నారు. అయితే, యూనివర్సిటీలనే నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ముందుకు వెళ్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆ సంఘం నేతలు హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్నీ యూనివర్సిటీలలో కలిపి మొత్తం 1,445 మంది ఒప్పంద అధ్యాపకులు పనిచేస్తున్నారని, తమ ఉద్యోగ భద్రతపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ సాయిచంద్ర, అన్నీ విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.



సందడే.. సందడి..

జహీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. మండలంలోని గోవిందాపూర్ శివారులోని హాటాన్స్ కర్మాగారానికి హైదరాబాద్‌లోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వచ్చారు. సుమారు 500 మంది విద్యార్థులు బృందాలుగా ఏర్పడి కర్మాగారం కలియదిరిగారు. ఈ సందర్భంగా నిర్వహించిన మేజిక్ షో(ఇంద్రజాల ప్రదర్శన) ఆకట్టుకుంది.



పాతపంటల జాతరలో మాట్లాడుతున్న జాతర కన్వీనర్ వినయ్‌కుమార్

జాడిమల్కాపూర్‌లో పాతపంటల జాతర

జహీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్‌లో సోమవారం డీడీఎస్ ఆధ్వర్యంలో పాతపంటల జాతరను నిర్వహించారు. మహిళా రైతులు, గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చిరుధాన్యాలతో అలకంరించిన ఎడ్లబండ్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాత పంటల జాతర నిర్వాహకులు వినయ్‌కుమార్ చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని వివరించారు. మారుతున్న ఆహార అలవాట్ల నేపథ్యంలో చిరుధాన్యాలకు, చిరుధాన్యాల ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. డిమాండ్ మేరకు చిరుధాన్యాలను సాగుచేయాలన్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు డీడీఎస్ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీడీఎస్ మహిళారైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పాతపంటల జాతరలో మహిళారైతులు, గ్రామస్థులు

సీఎస్ఆర్ నిధులతో స్కూల్.. అంగన్‌వాడీ కేంద్రం

- కాజీపల్లిలో రూ.2.30 కోట్లతో నిర్మాణం
- ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



పాఠశాల ప్రారంభోత్సవంలో ఎంపీ రఘునందన్‌రావు

జిన్నారం, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాజీపల్లిలో కెమ్‌టెక్ పరిశ్రమ తన సీఎస్ఆర్ నిధులు రూ.2.30 కోట్లతో నిర్మించిన స్కూల్, అంగన్‌వాడ ఈ భవనాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, విద్యారంగానికి పరిశ్రమలు చేయూత నిర్వాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులు చదివేలా తల్లిదండ్రులు, నాయకులు కృషి చేయాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి కెమ్‌టెక్ పరిశ్రమ యాజమాన్యం చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎండీ గోపాలకృష్ణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, మాజీ సర్పంచ్‌లు చీట్ల సత్యనారాయణ, ఆకుల మమత, మాజీ ఎంపీటీసీ భార్గవ, నాయకులు నవీన్, గడ్డె నర్సింహ్మ, ఆశోక్, రమాకాంత్ అధికారులు పాల్గొన్నారు.

టీజీ ఐఐసీకి 78 ఎకరాలు అప్పగింత



చెక్కులు పంపిణీ చేస్తున్న అధికారులు

చేగుంట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడియారం శివారు 307 సర్వే నెంబర్‌లోని 78 ఎకరాల భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకుని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు అందజేసినట్లు తహసీల్దార్ నారాయణ తెలిపారు. సోమవారం మిగిలిన 20 ఎకరాల 22 గుంటలకు సంబంధించి భూమిని స్వాధీనం చేసుకోని ఎకరాకు రు. 8 లక్షల చొప్పున 24 మంది రైతులకు రూ.ఒక కోటి 70లక్షల 93,748 చెక్కులను పంపిణీ చేశారు. పరిశ్రమల ఏర్పాటు కోసం టీజీ ఐఐసీకి 2016 నుంచి భూ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీ ఐఐసీ ఏవో మహ్మద్ నజీద్, తూప్రాన్ ఆర్డీవో కార్యాలయ అధికారి లక్ష్మణ్‌రావు, ఆర్ఐ జైభారత్ రెడ్డి, సర్వేయర్ రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రాయపోల్‌కు సహకార సంఘం..!

● ఐదేళ్ల క్రితమే నోటిఫికేషన్ వెలువడినా ఏర్పాటు కాని వైనం ● కమిటీల గడువు ముగియనుండటంతో కొత్త సంఘాల ఏర్పాటుకు చర్యలు

రాయపోల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైన వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచే సహకార సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సహకార సంఘాల సేవలు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తీసుకున్నట్లు తెలిసింది.

నేటికీ 'ఉమ్మడి' సహకార సంఘమే

2017 లో ప్రభుత్వం ఉమ్మడి దౌల్తాబాద్ మండలాన్ని విభజించి రాయపోల్ కేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేసింది. ఇంచుమించు అన్ని ప్రభుత్వ కార్యాలయాల విభజన పూర్తి చేసి రాయపోల్‌లో ఏర్పాటు చేశారు. కానీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాత్రం ఉమ్మడిగానే కొనసాగుతున్నది. ఉమ్మడి దౌల్తాబాద్ సహకార సంఘంలో మొత్తం 3,223 మంది సభ్యులు ఉండగా దౌల్తాబాద్ మండలంలో 1,680, రాయపోల్ మండలంలో 1,543 మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి సొసైటీ నుంచి రూ. 7 కోట్ల 34 లక్షలు పంట రుణాల కింద, రూ. 6కోట్ల 54 లక్షలు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చారు.

ఐదేళ్ల క్రితమే నోటిఫికేషన్

ప్రతీ మండలానికి కనీసం రెండు సహకార సంఘాలు ఉండాలని నిర్ణయించిన ప్రభు త్వం 2020 జనవరి 22న రాయపోల్, వడ్డెపల్లి కేంద్రాలుగా రెండు సంఘాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద వేలాడదీశారు. కారణమేంటో తెలియదు కానీ నూతన పీఏసీఎస్‌లు ఏర్పాటు కాలేదు.

ఫిబ్రవరిలో ముగియనున్న కమిటీల గడువు

సహకార సంఘాల పదవీ కాలం ఫిబ్రవరి 15న ముగియనున్నది. గడువులోపే డైరెక్టర్లు, చైర్మన్‌లకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. సమయం తక్కువగా ఉండడంతో నూతన సహకార సంఘాల ఏర్పాటును వేగవంతం చేయాల్సిన అవసరం ఉన్నది.



ఉమ్మడి దౌల్తాబాద్ మండల సహకార సంఘం

నూతన సంఘం ఏర్పాటు ఎంతో మేలు

నూతన సహకార సంఘం ఏర్పాటైతే తమకు ఎంతో మేలు జరుగుతుందని మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సహకార సంఘం కార్యాలయం దౌల్తాబాద్‌లో ఉండడంతో రాయపోల్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. దీంతో ఈ సంఘం ద్వారా రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నా పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదు. ఇక రాయపోల్ మండలంలోనే నూతన సహకార సంఘం ఏర్పాటైతే అవి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులోకి వస్తాయని మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సహకార సంఘంలోని సభ్యుల ద్వారా పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. దీంతో సహకార సంఘంలో డైరెక్టర్ల పోస్టులు పెరగడంతో పాటు చైర్మన్‌గా రాయపోల్ మండలానికి చెందిన వారికి అవకాశం దక్కుతుంది.

పొట్లపల్లిలో జాతర టెండర్లు

హుస్నాబాద్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలం పొట్లపల్లిలో స్వయంభు రాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా సోమవారం ఆలయ అధికారులు టెండర్లు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పలువురు టెండర్లు దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిద్దిపేట డివిజన్ పరిశీలకులు విజయలక్ష్మి, ఆలయ కార్యనిర్వహణాధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించి న్యాయం చేయండి

బెజ్జంకి,జనవరి27(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించకుండా అనర్హులకు పథకాల జాబితాలో చోటు కల్పించారనీ ఆరోపిస్తూ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన పలువురు మహిళలు బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయం ముందు దరఖాస్తు ఫారాలతో బైఠాయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరాపూర్ గ్రామంలో అధికారులు తప్పుల తడకగా జాబితాను రూపొందించి ఆదివారం పలువురు అనర్హులకు ప్రొసీడింగ్ కాపీలను అందచేశారన్నారు..దీంతో ఎంపీవో మంజుల వారితో మాట్లాడి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే అర్హులను గుర్తించి న్యాయం చేస్తామనీ తెలపడంతో నిరసనను విరమించి దరఖాస్తు ఫారాలను అందజేశారు.

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకున్నది. సోమవారం సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గుండ్ల చెరువు ప్రాంతంలో నివాసముంటున్న దేవయ్య(45) దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం దేవయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లి కల్లు తాగి రాత్రి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో అతడు ఇతరుల మొబైల్ ఫోన్‌ను తన వెంట తీసుకువచ్చాడు. సెల్‌ఫోన్‌కు సంబంధించిన వారు ఫోన్ చేసి దేవయ్య ఇంటికి వచ్చి తమ సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లారు. అనంతరం దేవయ్య ఇంట్లో మరో గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. అతడి భార్య పద్మ ఎంత పిలిచినా తలుపు తెరవకపోవడంతో భర్త తాగిన మత్తులో నిద్రిస్తుండవచ్చు అని భావించింది. ఆదివారం ఉదయం వారి కూతురు కిటికీలో నుంచి చూడగా దేవయ్య సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడిని కిందికి దించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వాహనం బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు


ధ్వంసమైన వాహనం, క్షతగాత్రులు మధు, భాను

చేర్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్త్యాల గ్రామశివారులో స్కార్పియో వాహనం బోల్తా పడిన సంఘటనలో యాదాద్రి-భువనగిరి జిల్లాకు చెందిన పలువురు గాయాలపాలయ్యారు. యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామానికి చెందిన పలువురు స్కార్పియో వాహనంలో కొమురవెల్లి మల్లన్న దర్శనం చేసుకుని సోమవారం సాయంత్రం తిరుగుప్రయాణమయ్యారు. మార్గమధ్యలో మద్యం తాగారు. ఈ క్రమంలో స్కార్పియో వాహనాన్ని డ్రైవర్ పసునూరి వేణుగోపాల్ అతివేగం, అజాగ్రత్తతో నడిపించగా, ముస్త్యాల గ్రామశివారులోని మూలమలుపువద్ద బోల్తాపడింది. రోడ్డుపక్కన పల్లంగా ఉండటంతో వాహనం పల్టీలు కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న మధు, బాబూరి భాను, నాగపురి వెంకటేశ్, భైర రాజులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108అంబులెన్స్ సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

సిద్దిపేటలో సమస్యల పరిష్కారంపై కౌన్సిల్ దృష్టి

● మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు

సిద్దిపేట టౌన్, జనవరి27 (ఆంధ్రజ్యోతి): భావిస్‌ఖాన్ పూల్ కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు పలువురు వార్డు కౌన్సిలర్లు పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో స్తంభాలకు విద్యుత్ దీపాలు సరైన సమయానికి వెలగడం లేదని, వాటికి మరమ్మతులు నిర్వహించడంతో పాటు వీధి దీపాలకు సోలార్ సిస్టంను ఏర్పాటు చేసే ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. భావిస్‌ఖాన్ పూల్ కూల్చివేసిన వారిపై కేసులు నమోదయ్యాయని, కూల్చివేసిన వారిచేతనే వాటి మరమ్మతులు కూడా చేయించనున్నట్లు తెలిపారు. పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ (పిచికారి) చేయించాలని సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను ఆదేశించారు. ఆరుబయట చెత్త వేసేవారికి జరిమానాలు విధించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వెంటనే నిధులు మంజూరు చేసి సిద్దిపేట పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, మున్సిపల్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్ జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను కలెక్టర్ మను చౌదరి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవో అబ్దుల్ రెహమాన్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర చైర్మన్ రాజిరెడ్డి, స్టేట్ కన్వీనర్ రేణుక, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమల్లు, డివిజన్ అధ్యక్షుడు నర్సింలు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కోహెడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్ కరువు భత్యాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ ఎ క్యాలెండర్‌ను ప్రధానోపాధ్యాయులు ఎండీ మహమూద్ కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పెండింగ్ కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బుడుగు రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఎల్లం, సభ్యులు సురేష్, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలికట్టలో ఉచిత వైద్య శిబిరం

కొండపాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలికట్ట గ్రామంలో పీఏసీఎస్ డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బూరుగుల సురేందర్‌రావు ఆధ్వర్యంలో ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సిద్దిపేటకు చెందిన ఆధ్యా కంటి ఆసుపత్రి వైద్యులు ప్రజ్ఞాపూర్‌కు చెందిన అదితి ఆసుపత్రి వైద్యుల సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ వ్యాధులకు సంబంధించిన సమస్యలతో పాటు కంటి వైద్య పరీక్షలను చేసి ఉచితంగా మందులను అందజేశారు.

రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలి

హుస్నాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రూ. 2లక్షల రుణమాఫీ కాని రైతులకు వెంటనే మాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉడుగుల లావణ్యారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలో జరిగిన కిసాన్‌సంఘ్ మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు విత్తనాలు, ఫర్టిలైజర్‌ను ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారని, దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి పోటీలు

మద్దూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామంలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. వల్లంపట్ల ప్రథమ, ద్వితీయ స్థానంలో గాగిళ్లాపూర్ గ్రామాలు నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ స్థానం పొందిన గాగిళ్లాపూర్ జట్టుకు రూ. 10 వేలను నాయకులు నాయకులు అందజేశారు. క్రీడా పోటీలకు ఏలూరి కృష్ణ సహకారం అందించారు.

ప్రజాసేవకు పదవులు అవసరం లేదు


చేర్యాల మునిసిపల్ ఆత్మీయ వీడ్కోలు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకు పదవులు ఏమాత్రం అవసరం లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు చేర్యాల మునిసిపల్ పాలకమండలి పదవీకాలం ముగిసిన నేపథ్యంలో సోమవారం స్థానిక వీరభద్రగార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ వీడుకోలు సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులను శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయాలలో పదవులు శాశ్వతం కాదని, రాజకీయాలకతీతంగా పని చేస్తే ప్రజల మన్ననలు తప్పకపొందుతారన్నారు. విరమణ పదవికి మాత్రమే నని, ప్రజాసేవకు ఎంతమాత్రం కారాదన్నారు. చేర్యాల పట్టణాభివృద్ధికి పాలకమండలి చేసిన కృషి అభినందించదగిందన్నారు. నిధుల కేటాయింపుతో ప్రభుత్వ పథకాల అమలుకు ఎలాంటి విబేధాలు లేకుండా చూస్తానని, అందరికీ అందుబాటులో ఉంటూ చేర్యాల ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు అసెంబ్లీలో గళమెత్తి తనవంతు పాత్ర నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నాగేందర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

జనగామ ఎమ్మెల్యేపై దాడి సరికాదు: సీపీఎం

చేర్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా ఎర్రగుంట తండాలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడంతో పాటు కార్యకర్తలను గాయపరచడం అప్రజాస్వామికమని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలో సోమవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతల ఆగడాలు పెరిగిపోతున్నాయని, ఓటమి జీర్ణించుకోలేక దాడులకు పాల్పడుతున్నారన్నారు.సమావేశంలో నాయకులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, ఎల్లయ్య, వెంకట్‌మావో, అరుణ్‌కుమార్, రవీందర్, రవికుమార్ పాల్గొన్నారు.

దౌర్జన్యంతో గొంతు నొక్కడం తగదు: బీఆర్ఎస్

దాడి ఘటనను చేర్యాల బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, పుర్మ వెంకటరెడ్డి, అంకుగారి శ్రీధర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. దౌర్జన్యంతో ప్రశ్నించే గొంతును నొక్కాలని చూడటం తగదన్నారు. సమావేశంలో నాయకులు యాటయాదగిరి, బూరగోని తిరుపతి ఉన్నారు.

నేటి నుంచి పుల్లూరుబండపై లక్ష్మీనృసింహస్వామి జాతర

సిద్దిపేట రూరల్/సిద్దిపేట టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి); స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు బండ పై జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పుల్లురి కనకయ్యగౌడ్, వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల రంగచార్య, శ్రీనివాస చార్యులు తెలిపారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండపై విలేకరుల సమావేశం నిర్వహించి ఆహ్వాన పత్రికను అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతరకు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వస్తారని తెలిపారు. 29న పవిత్ర స్నానాలు, 30న గోపాల కాలువలు,స్వామివారి సేవ, 31న స్వామి వారి కల్యాణం ఫిబ్రవరి 1న చక్రతీర్థంతో జాతర ఉత్సావాలు ముగుస్తాయని తెలిపారు. కాగా పుల్లూరు బండ జాతరకు హాజరుకావాలంటూ కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు సోమవారం కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పుల్లూరు దేవస్థాన కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

రేపటి నుంచి ముర్షద్‌గడ్డ దర్గా ఉర్సు


సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉర్సుకు సిద్దిపేటలోని ముర్షద్ గడ్డ దర్గా ముస్తాబవుతోంది. ఈ నెల 29 నుంచి 31 వరకు జరిగే ఉత్సవాలకు ఉత్సవకమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం సిద్దిపేట ముర్షద్ గడ్డ చిష్తియా పీఠం ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించిన అనంతరం కమిటీసభ్యులు మీడియాతో మాట్లాడారు. చిష్తియా పీఠాధిపతి ఖ్వాజా మహ్మద్ హకీం షరీఫ్ చిష్తి మాట్లాడుతూ. 29న సమాధి పవిత్ర స్నానం, గంగారాధన, ఊరేగింపు, 30న దీపారాధన, 31న ఖురాన్ పఠనం, వేదాంత హారతితో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజూ వేద జ్ఞానామృత ఖవ్వాలి, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో జనాషీన్‌సాబెర్ షరీఫ్ చిష్తి, అఫ్జలుద్దీన్ చిష్తి, నాయబ్ రెడ్డి చిష్తి, ప్రభుదాసు చిష్తి, పైజుద్దీన్ చిష్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి

● జిల్లాలోని తహసీల్ కార్యాలయాల్లో పీఆర్టీయూ నాయకుల వినతి


గజ్వేల్ ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. పీఆర్టీయూ రాష్ట్రశాఖ పిలుపుమేరకు భోజన విరామ సమయంలో సోమవారం జిల్లావ్యాప్తంగా పీఆర్టీయూ సంఘం నాయకులు ఆయా మండలాల్లో తహసీల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానం మాత్రమే ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ భద్రతను కల్పిస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగించే చట్టాలు, సంస్కరణలు తీసుకువస్తే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పన్యాల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయసంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ హైమద్‌ఖాన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నీరడి లక్ష్మీనారాయణ,ఎండి నాజీం బాబా, మండల అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్‌రెడ్డి,నాయకులు జలంధర్, చంద్రమౌళి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ పీఆర్టీయూ గజ్వేల్‌శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు వంటేరు సత్యనారాయణ రెడ్డి, తీగుళ్ల లింగంగౌడ్ గజ్వేల్ ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. తొగుట తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అధికారులకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పీఆర్టీయూ దుబ్బాక అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి మండల అధ్యక్షులు లక్ష్మన్, వెంకటేశం, మహేందర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్‌లకు వేర్వేరుగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాలను అందజేశారు. చేర్యాలలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కేవీఎన్ రెడ్డి యూనియన్ నాయకులతో కలిసి తహసీల్దారు సమీర్‌అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. మర్కుక్ మండలంలో పీఆర్టీయూ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, కుమార్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో యూపీఎస్ ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ, ఓపీఎస్‌ను అమలు చేయాలని తహసీల్దార్ అరిఫాకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నర్సింలు, జిల్లా కార్యదర్శి బాలకిషన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. పీఆర్టీయూ కుకునూరుపల్లి మండలశాఖ అధ్యక్షుడు కూరెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమల వెంకటరమణ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

అదేవిధంగా నంగునూరు మండలంలో తహసీల్దార్ సరితకు, మద్దూరు మండలంలోని తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ రమేష్‌కు పీఆర్టీయూ నాయకులు వేర్వేరుగా స్థానిక ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి వినతిపత్రాలు సమర్పించారు.

మంచి నాయకుడిని కోల్పోయాం

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రామచంద్రం అకాల మరణం అందరిని కలచి వేసిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్, మాజీ ఎంపీపీ నముండ్ల రామచంద్రం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఆయన దశదినకర్మ సందర్భంగా కుటుంబ సభ్యులు మైలారంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి రామచంద్రం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంచి సీనియర్‌నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆయన పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోరీ ఘటనల్లో ముగ్గురి అరెస్ట్

సిద్దిపేట అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేర్వేరు మండలాల్లో చోటు చేసుకున్న చోరీ ఘటనల్లో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణంలోని త్రీటౌన్ పరిధిలో చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మైత్రీవనంలో ఓ ఇంటి యజమాని తన ఇంటి నుంచి బయటకు వెళ్లే క్రమంలో ఇంటి మెట్ల వద్ద తన బంగారు నగల పర్సును మర్చిపోయాడు. ఆ పర్సు దొంగతనానికి గురైందని త్రీ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫిర్యాదుదారుడి ఇంట్లోనే అద్దెకుండే నర్మెట్ట గ్రామానికి చెందిన తాళ్ల మల్లేశం అనే వ్యక్తి చోరీ చేసినట్లుగా గుర్తించారు. అతడి నుంచి 6 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు సిద్దిపేట త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

● మద్దూరు: మండలంలోని గాగిళ్లాపూర్ శివాలయం, దూళిమిట్ట మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయాల్లో చోరీకి పాల్పడిన యువకుడిని గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఏఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరు మండలం ఖాతా గ్రామానికి చెందిన సిరిగిరి మోషి అనే యువకుడు దూళిమిట్ట మండల కేంద్రం శివారులోని ఎల్లమ్మ ఆలయంతో పాటు మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లోని శివాలయంలో చోరీకి పాల్పడినట్టు తెలిపారు. మోషి నుంచి రూ.939లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● చేర్యాల: పట్టణ శివారు నర్సాయపల్లి దారిలోని ఎల్లమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన కొండపాక మండలం నాచారం గ్రామానికి చెందిన యామ చందును పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం సీఐ ఎల్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం సక్రమంగా లేనట్లు ప్రవర్తిస్తున్న చందు ఎల్లమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన అనంతరం స్థానిక శ్రీనగర్ కాలనీలలోని పలు ఇళ్లలో చోరీకి యత్నించాడు. రాత్రిపూట ఆగంతకులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ నీరేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి పట్టణ పరిసరాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్టు

కొండపాక , జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పరశురాములు అనే వ్యక్తిపై దాడి చేసి ఆయన భార్య చీరెను చింపిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. గత డిసెంబర్ 24న భూ తగాదాల విషయంలో అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి నర్సింలు, తాళ్లపల్లి చంద్రం అనే ఇద్దరు వ్యక్తులు తన భర్త పరశురాములను తిట్టి, కట్టెలతో కొట్టి తన చీరను పట్టి చింపారని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్టు సీఐ వివరించారు.

భైలంపూర్‌లో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత

ములుగు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైలంపూర్ గ్రామంలో సోమవారం శ్మశానవాటిక స్థలం కోసం ఇరువర్గాల మధ్య గొడవ చోటుచేసుకున్నది. గ్రామంలోని ఓ వర్గం కోసం స్మశాన వాటిక స్థలాన్ని కెటాయించగా వారు అక్కడ సమాధులు చేయకుండా గ్రామంలోని మరో స్థలం పక్కన సమాధులు పెడతామని అనడంతో గ్రామంలోని ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సమాచారమందుకున్న ములుగు ఎస్ఐ సీఐ రాజేందర్‌తో కలిసి భైలంపూర్ గ్రామానికి చేరుకున్నారు. అక్కడున్న ఇరు వర్గాలవారికి నచ్చజెప్పే క్రమంలో కొందరు పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. అయినప్పటికీ పోలీసులు చొరవ చూపి ఇరువర్గాలకు నచ్చచెప్పి గ్రామంలో అందరు కలిసి ఉండాలని, గొడవలకు తావు ఇవ్వకూడదని సర్దిచెప్పారు.

కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించాలి


కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రావు

గజ్వేల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ఎమ్మెల్యే గారూ... మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసి గెలిపించిన ప్రజలకు కేసీఆర్ అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని, కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించి, సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి వెళ్లకుండా, నియోజకవర్గంలో ప్రజల్ని కలువకుండా ఉండడం సరికాదని, కేసీఆర్‌కు ఇష్టం లేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి గోపాల్‌రావు, ములుగు మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, నాయకులు ఉన్నారు.

మత్స్య, జంతు శాస్త్ర విద్యార్థుల క్షేత్ర పర్యటన

సిద్దిపేట కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుబంధ పీజీ మత్స్య, జంతు శాస్త్ర విభాగం విద్యార్థులు సోమవారం క్షేత్ర పర్యటన చేశారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్‌లో లభించే వివిధ రకాల చేపలను గుర్తించటం, వాటి లక్షణాలు, చేపల ధరల్లో వ్యత్యాసాన్ని తెలుసుకున్నారు. ఉత్పత్తిదారుల నుంచి కొనుగోలుదారుల వరకు మధ్యవర్తుల పాత్ర, మార్కెట్ విధానాలను అధ్యయనం చేశారు. విద్యార్థులతో పాటుగా అధ్యాపకులు తూమోజు జగదీశ్వరాచారి, దరావత్ రాంకుమార్, జి. వెంకటేష్ ఉన్నారు.